క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జ్యూవెలరీ పార్క్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అసోసియేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ చైర్మన్ టీఎస్ఎస్ బాలాజీ, చలమల్లశెట్టి ప్రసాద్‌లు శిబిరాన్ని ప్రారంభించారు. మణిపాల్ హాస్పిటల్ విజయవాడ వైద్య బందం క్యాన్సర్, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. రెడ్ క్రాస్ సెక్రటరీ శంకర్‌నాథ్, కోశాధికారి రాంబాలాజీ, స్టేట్ ఎంసీ సభ్యుడు కొత్తగుండు రమేష్, కోఆర్డినేటర్ హరికష్ణ, పెద్దేటి సుబ్బారావు, చలమలశెట్టి మాధవి, తాత లక్ష్మీదుర్గ, డిజాస్టర్ మేనేజ్మెంట్ కన్వీనర్ కొండపల్లి కష్ణతేజ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం

కోడూరు: కోడూరు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను శుక్రవారం సర్పంచి వెన్నా షైనీ, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రధాన కూడళ్లలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం పాదచారులకు ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచి చెప్పారు. ఇన్‌చార్జీ ఈఓపీఆర్డీ గోపాలకృష్ణ, కార్యదర్శి బొలిశెట్టి శేషగిరిరావు, వార్డు సభ్యులు వెన్నా ప్రసాద్, బొట్టు వేణు, మెండు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ రాయుళ్లపై కేసు నమోదు

చల్లపల్లి: క్రికెట్ బెట్టింగులు ఆడుతున్న ఎనిమిది మందిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. చల్లపల్లి ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. చల్లపల్లి–మచిలీపట్నం రోడ్డులోని మెడ్‌ప్లెస్ మెడికల్ స్టోర్ పక్కన ఓ షాపులో క్రికెట్ బెట్టింగులు ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ ఆయన బృందంతో కలిసి దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. వారి నుంచి రూ.10,200లు నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

క్షణక్షణం భయం భయం


పెచ్చులూడుతున్న శ్లాబు కింద విధులు నిర్వర్తిస్తున్న అధికారులు


పెచ్చులు ఊడి చువ్వలు బయటకు కనిపిస్తున్న శ్లాబు

- కాలం చెల్లిన భవనంలో చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం
- బీటలువారిన గోడలు, పెచ్చులూడుతున్న శ్లాబులు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న అధికారులు

చల్లపల్లి: మూడున్నర దశాబ్దాల కాలం నాటి భవనంలో దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. బీటలు వారిన గోడల మధ్య, పెచ్చులూడి పడుతున్న శ్లాబుల కింద క్షణ క్షణం భయం భయంగా ఎప్పుడు కూలుతుందో తెలియని భవనంలో కాలం నెట్టుకొస్తున్నారు. ఇది చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయ దీనస్థితి. రెండేళ్ల కిందటే పంచాతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ఈ భవనానికి కాలం చెల్లిందని, కార్యాకలాపాలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా లేదని ధృవీకరించినా ఇప్పటి వరకూ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

శిథిలావస్థకు చేరిన కార్యాలయం

చల్లిపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని జూన్ 8, 1989లో అప్పటి గవర్నర్ కుముద్ బెన్ జోషి, జిల్లా పరిషత్ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావులు ప్రారంభించారు. ఇప్పటికి 36 ఏళ్లుగా పూర్తి చేసుకుని శిథిలావస్థకు చేరింది. గోడలు, శ్లాబు నుంచి పెచ్చులు ఊడి చువ్వలు బయటకు వచ్చాయి. ఎక్కడ శ్లాబు పెచ్చులు తమ నెత్తిమీద పడతాయోనని భయాందోళనలో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. గోడలు బీటలు వారాయి. వర్షాకాలంలో శ్లాబు నుంచి నీరు లోపలికి రావడంతో రికార్డులు కూడా తడిచి పాడయిపోతున్నాయని చెపుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం భూత్ బంగ్లాలా కనిపిస్తుందంటే ఆ భవనం పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎలక్ట్రికల్ వైర్లు కూడా బయటకు వేళాడుతుండటంతో వాటి పక్కనే కూర్చొని అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నిత్యం పనుల మీద, అధికారులను కలిసేందుకు ప్రజలు వస్తూ ఉంటారు. లోపల బల్లలపై కూర్చొంటారు. అలాగా నెలలో రెండు నుంచి మూడుసార్లు రేషన్ డీలర్లతో, వీఆర్ఓలతో.. గ్రామస్తులతో అధికారులు సమావేశాలు నిర్వహిస్తూనే ఉంటారు. ఇలాంటి సమయాల్లో ఏమైనా అనుకోని సంఘటనలు జరిగితే నష్టం భారీగానే ఉంటుందని కార్యాలయంలోని కొందరు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


చవుడుగారుతున్న తహసీల్దార్ కార్యాలయ గోడలు

రెండేళ్ల కిందటే కాలం చెల్లినట్లు ధ్రువీకరణ

పంచాయతీరాజ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, అసిస్టెంట్ ఇంజినీర్లు చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అయితే నిర్మాణం జరిగి మూడు దశాబ్దాలు దాటిపోవడం, భవనం పూర్తిగా పాడైపోయిన స్థితిలో ఉండటంతో ఈ భవనం ఉపయోగానికి పనికిరాదని రెండేళ్ల కింద అనగా అక్టోబర్ 13, 2022వ తేదీన ధ్రువీకరించి సర్టిఫికేట్ జారీ చేశారు. అయినప్పటికీ జిల్లా అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి దాపురించింది. చేసేది లేక ఆ పాడుబడిన భవనంలోనే కాలం వెల్లదీస్తున్నామని కార్యాలయ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

రూ.60లక్షలతో అంచనాలు

చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయ భవనం పాతబడి శిథిలావస్థకు చేరుకున్నట్లు నాతో పాటు ఉన్నతాధికారులు పరిశీలించి ధృవీకరించారు. కొత్త భవనం నిర్మాణానికి రూ.60లక్షలు అవుతుందని అంచనాలు తయారు చేసి తహసీల్దార్ కార్యాలయం అధికారులకు సమర్పించారు.

– బీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ

వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా పొనమాల

చల్లపల్లి: వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా ఆర్టీఐ విభాగ అధ్యక్షుడిగా చల్లపల్లి మండలం నడకుదురు గ్రామానికి చెందిన పొనమాల నాగరాజు నియమితులయ్యారు. రాష్ట్ర ఆర్టీఐ విభాగం అధ్యక్షురాలు టీ కల్పలతారెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందినట్లు నాగరాజు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం ఆయన బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా కల్పలతారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింహాద్రి రమేష్‌బాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. నాగరాజు వెంట నడకుదురు గ్రామ సర్పంచ్ గొరిపర్తి సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి హరిబాబు, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ వడుగు రామచంద్రరావు, పీతా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పొనమాల

కళాకారులకు సన్మానం

చల్లపల్లి: ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల నంది అవార్డులు అందుకున్న రంగస్థల, సినీ కళాకారుడు బోలెం రామారావు, పౌరాణికమేటి పుప్పాల వీరాంజనేయులను శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ పార్కులోని కళావేదికపై సత్కరించారు. వీరితోపాటు రంగస్థల కళాకారులు బెల్లంకొండ ఏడుకొండలు, వేముల సూరిబాబు, రాజులపాటి వీరాచారి, సుబ్బయ్య, మల్లంపల్లి రాంబాబు, వయోలిన్, హార్మోనిస్టులు డీ రమేష్, శర్మ, శ్రీరామ్, సత్యనారాయణ, నారేపాలెం వేణు, పూర్ణచంద్రరావు, కోలాటం గురువు వేముల అంకంబొట్లు, డబ్బు కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసరావులను శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. బోలెం రామారావు–నాగమణి దంపతుల ఆర్థిక సహకారంతో రూ. 3లక్షలతో నిర్మించిన మేకప్ గదిని ఉపసర్పంచ్ ముమ్మనేని రాజ్‌కుమార్(నాని), లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆకుల స్వాభూ ప్రసాద్, నర్రా సాయిబాబుల చేతుల మీదుగా ప్రారంభించారు.


చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులోని కళాపరిషత్ ఆధ్వర్యంలో నంది అవార్డు గ్రహీతలు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

బంటుమిల్లి: వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకంలో కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను నాయకులు శుక్రవారం సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు పని దినాలు, వేతనాలు పెంచాలని, ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం నిలుదల చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధన కోసం మే 5వ తేదీన చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఎం శ్రీనివాసరావు, జీ నాగేశ్వరరావు, ఎస్ చంద్రశేఖర్, ఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

మచిలీపట్నంటౌన్: నగరంలో గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని పరాసుపేటలోని ఆర్సీఎం చర్చికు చెందిన క్రైస్తవులు నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించగా ఆయా చర్చిల పాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. ఆర్సీఎం చర్చి వద్ద ప్రారంభమైన శాంతి ర్యాలీ ప్రధాన రహదారుల గుండా సాగింది. స్థానిక లక్ష్మీటాకీసు సెంటరు నుంచి కోనేరుసెంటర్, కెనడీరోడ్ మీదుగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సిలువను మోస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రభువైన ఏసు క్రీస్తు మానవాళి పట్ల ప్రేమ, కరుణ, క్షమ, సహనం, త్యాగం చూపారన్నారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ గడిదేశి బాలజీసు, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, గడిదేశి డేవిడ్‌రాజు, గాజుల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: అవనిగడ్డ మండలంలోని పలు ప్రాంతాల్లో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగిరిలంక ఆర్సీఎం చర్చి విచారణ గురువు సురేష్ మెర్లో ఆధ్వర్యంలో శిలువ మార్గం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శిలువ మోశారు. అనంతరం క్రైస్తవ విశ్వాసులకు గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక కోటగిరిలంక ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు చేశారు. ఉపదేశిలు, సంఘ పెద్దలు, మరియ దళ సభ్యులు పాల్గొన్నారు.

చల్లపల్లి: మండల పరిధిలోని శాలిపేట ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం శిలువ మార్గంలో అనుసరిస్తూ దివిసీమలోని పలు గ్రామాల ఉపదేశికులు, విశ్వాసులు ప్రార్థనలు చేశారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ బీ రవికుమార్ ఆధ్వర్యంలో క్రీస్తు శాంతి సందేశాలను అందజేశారు. స్థానిక సెయింట్ మదర్ థెరీస్సా స్కూల్ కరెస్పాండెంట్ ఆంద్రూ గ్రోమ్స్, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి మజ్జిగ పంపిణీచేశారు. కొత్తమాజేరు షారేము ప్రార్థనా మందిరంలో జరిగిన ప్రార్థనల్లో ముఖ్య అతిథిగా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు పాల్గొన్నారు.

నాగాయలంక: మండలంలోని పలు ప్రార్థనా మందిరాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. నాగాయలంక–అవనిగడ్డ మెయిన్ రోడ్డులోని ఆర్సీఎం ప్రధాన చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు ఏసుకు జేజేలు పలుకుతూ గుడ్ ఫ్రైడే శిలువ మార్గం ప్రదర్శన నిర్వహించారు. సంఘపెద్దలు, ఉపదేశకులు పాల్గొన్నారు. రక్షణ సైన్యం (సాల్వేషన్) ఆధ్వర్యంలో మండలంలోని దీనదయాళపురంలో సంస్థ చర్చిలో గుడ్ ఫ్రైడే జరిగింది. సంస్థ డీఓ మేజర్ తొలగతోటి ప్రసాదరావు, గృహ సమితి స్త్రీలు, బాలవీరులు తదితరులు పాల్గొన్నారు. ఎదురుమొండి, టీ.కొత్తపాలెం శివారు డేగలవారిపాలెం నెహెమ్యా మినిస్ట్రీస్, నాగాయలంక షెకీనా మినిస్ట్రీస్‌లో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు.

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను ఘనంగా జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు శిలువ ధారిగా ఉన్న వైనాన్ని శిలువ మోస్తూ ప్రదర్శించారు.

మచిలీపట్నంటౌన్: ఏసుక్రీస్తు మానవాళి రక్షణ కోసం శిలువపై మరణించారని శారదానగర్ సాగరమాత విచారణ గురువు జాన్ డీ క్రూస్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా సాగరమాత ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు. పురవీధుల్లో ప్రత్యేక శిలువ మార్గాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), చిన్నాపురం, వాడపాలెం, సింహాచలం, రుద్రవరం, శారదనగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.


చల్లపల్లి మండలం శాలిపేటలో శిలువ మార్గం


క్రైస్తవులతో కలిసి శిలువ మోస్తున్న పేర్ని కిట్టు

పెడన: పెడన పట్టణంలో గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. సిలువ మార్గాన్ని పుర వీధుల్లోని ప్రధాన రహదారుల వెంబడి ఏసుప్రభువు కీర్తనలతో, క్రీస్తు నామాన్ని జపిస్తూ ర్యాలీ కొనసాగింది. ఆర్సీఎం చర్చి ఫాదర్ జోజప్ప మాట్లాడుతూ క్రీస్తు మరణం చాలా బాధకరమైనా రోజు అయినా క్రీస్తు భక్తులు క్రీస్తు సందేశం ప్రకారం సంతోషంగా జరపాలన్న ఉద్దేశముతోనే శుభశుక్రవారంగా పిలువబడుతుందన్నారు. ప్రేమాంజలి కాన్వెంట్ సిస్టర్స్, సంఘ పెద్దలు, ఉష్లా సభ్యులు, మరియదళ సభ్యులు, యువతీయువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే గ్రామోత్సవం

బంటుమిల్లి: స్థానిక ఆర్సీఎం చర్చి పాదర్ కొండ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం బంటుమిల్లి పుర వీధుల్లో గుడ్ ఫ్రైడే గ్రామోత్సవం నిర్వహించారు. ముందు ఫాదర్ శిలువ మోస్తూ నడవగా చర్చి పరిధిలోని 16 సంఘాలకు చెందిన సంఘస్తులు శిలువ బొమ్మలు చేతపట్టి ప్రార్థనలు చేస్తూ నడిచారు. గత 40 రోజులుగా దీక్షలు చేస్తున్న సంఘస్తులు శిలువ ప్రార్థనలు చేస్తూ ఉత్సవం అనంతరం చర్చి వద్ద దీక్షలు విరమించారు. అలాగే కొత్తపల్లి ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో ఫాదర్ టీ జయరాజు పర్యవేక్షణలో పెదతుమ్మిడి, అర్జావానిగూడెం, పెనుమాలగూడెం, మల్లపరాజు గూడెం గ్రామాల్లో శిలువను మోస్తూ గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. పలు గ్రామాల సంఘస్తులు పాల్గొన్నారు.


అవనిగడ్డలో శిలువ మోస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

గూడూరు: మండలంలోని ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఏసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ మత బోధకులు ప్రసంగించారు. మండల కేంద్రమైన గూడూరులోని షాలెం ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఏసురత్నం ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. పటాన్‌పేటలోని షారోన్ కాస్పెల్ చర్చిలో తిమోతీ ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనల్లో పెద్ద ఎత్తున సంఘసేవకులు పాల్గొన్నారు. కంకటావ, గురిజేపల్లి, గండ్రం, మల్లవోలు, తరకటూరు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


నాగాయలంక మండలం దీనదయాళపురంలో ప్రార్థనలు


కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం విశ్వాసులు


పెడనలో శిలువ మార్గం


బంటుమిల్లిలో ట్రాక్టరుపై ఏసుప్రభువు శిలువ దృశ్యాన్ని ఉంచి ఊరేగిస్తున్న సంఘస్తులు

ఘంటసాల మండలంలో..

ఘంటసాల: మండలంలోని అన్ని చర్చిల్లో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఏసుక్రీస్తు మరణం గురించి ప్రత్యేక గీతాలు ఆలపించారు. ఘంటసాల, కొడాలి బాపిస్టు చర్చిల్లో రెవ.ఎండీవీ ప్రసాద్, మట్టా సునీత్, సునీల్, ఇతర చర్చిల్లో దైవజనులు కె.దానియేలు, ఎ.యేసు, సీహెచ్.దానియేలు, కె.యేసు పాదాలు, యండకుదురు, కొడాలి, తెలుగురావుపాలెం, శ్రీకాకుళం, పాపవినాశనం, దాలిపర్రు చర్చిల్లో పాస్టర్లు శీరం సుందర్ సింగ్, గుడిసేవ ప్రదీప్, కావూరి ప్రకాష్, షాలేమ్‌రాజు, శేఖర్, వందనం, యేసు ముత్యాలు, గోవాడ శ్యామ్‌బాబు, బాప్టిస్లు, ఆర్సీఎం, సీఎస్ఐతో పాటు మండలంలోని అన్ని చర్చిల్లో గుడ్ ఫ్రైడే జరుపుకొన్నారు.

ప్రపంచ మానవాళికి శాంతి అందించిన ఏసుప్రభువు

పెదప్రోలు(మోపిదేవి): గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని పలుగ్రామాల్లో ప్రార్థనా మందిరంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు, పాటలు ఆలపించారు. పెదప్రోలు ఐపీసీ ప్రార్థనా మందిరంలో పాస్టర్ ప్రేమ్ కుమార్ ఏసు క్రీస్తు సందేశమిస్తూ అనంత కరుణామయుడైన జీసస్ మహాత్యాగానికి గుర్తు గుడ్ ఫ్రైడే అన్నారు. క్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ ఆయన బోధనలు పాటిస్తూ సర్వ మానవ సమానత్వాన్ని శాంతిని నెలకొల్పేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పాటలు పాడారు. ప్రభువు సేవకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శిలువ ప్రదర్శనలు

కోడూరు: కోడూరులోని కృష్ణాపురం ఆర్సీఎం చర్చి వద్ద గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. విచారణ గురువులు చౌతపల్లి ప్రశాంత్ పర్యవేక్షణలో క్రీస్తు శిలువతో చర్చి వద్ద నుంచి కోడూరు ప్రధాన సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. క్రీస్తు అనుసరించిన మార్గాన్ని విశ్వాసులకు బోధించడంతో పాటు ఏసుక్రీస్తు చేసిన త్యాగాలను వివరించారు. పాస్టర్లు విశ్వాసులకు దీవెనలు అందించారు. విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, మెరకగౌడపాలెం, వడ్డెరకాలనీ, నాయుడుపేట, జయపురం, హరిపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల వద్ద గుడ్‌ఫ్రైడేను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పాస్టర్లు, మందిరాల నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.


కోడూరులో శిలువ మార్గం నిర్వహిస్తున్న విచారణ విశ్వాసులు

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

గూడూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆకులమన్నాడు ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మసీదు సెంటర్‌లో శుక్రవారం వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం సోదరులు మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మహమ్మద్ రఫి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఫైజుల్ రహ్మన్(మున్నా)లు మాట్లాడుతూ ముస్లిం మతాచారాలకు భిన్నంగా వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశంలోని యావత్ సెక్యులర్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్రం స్పందించకపోవడం శోచనీయమన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు కూడా అభ్యంతరం తెలపడమే బిల్లులో ఉన్న కుట్రలకు నిదర్శనమని పేర్కొన్నారు.


ఆకులమాన్నడు మసీదు దగ్గర మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్న ముస్లింలు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

వెండి వస్తువులు, 20 కేజీల రాగి వైరు స్వాధీనం

గుడివాడరూరల్: సాయిబాబా మందిరంలో చోరీ చేసిన నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ ఎస్.చంటిబాబు, సిబ్బందిని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ శుక్రవారం అభినందించారు. స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో విలేకరులో సమావేశంలో ఆయన చోరీ వివరాలను వెల్లడించారు. గుడివాడ మండలం దొండపాడు కాలనీ శ్రీదేవినగర్‌లోని సాయిబాబా మందిరంలో ఈనెల 14వ తేదీన శ్రీకాళహస్తీకాలనీకి చెందిన పుప్పాల ప్రభుకుమార్ అనే యువకుడు రూ.2లక్షల విలువ చేసే కిలోన్నర వెండి వస్తువులు దొంగిలించారన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు సీఐ పర్యవేక్షణలో ఎస్ఐ చంటిబాబు దర్యాప్తు ప్రారంభించి చాకచక్యంగా శుక్రవారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అతడి వద్ద నుంచి రూ.1.50 లక్షల విలువైన కేజీన్నర వెండి వస్తువులతో పాటు బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చెందిన సుమారు రూ.50 వేలు విలువైన 20 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై గతంలో భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, రాజానగరం పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ చంటిబాబు, సిబ్బందికి డీఎస్పీ రివార్డులు అందజేసి అభినందించారు. సమావేశంలో తాలూకా సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును మీడియాకు చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

గుడివాడ టౌన్: అగ్నిప్రమాదాలకు అనేక అంశాలు కారణాలవుతాయని అప్రమత్తంగా ఉండటం మంచిదని డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జి. ఆంజనేయులు అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని కృష్ణవేణి అగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.